
Visit us @ http://epaper.suryaa.com



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

నిజామాబాద్

కామారెడ్డి

శనివారం, 24 ఆగష్టు 2024

పేజీలు: 06




# ప"రేషన్"

## నాగిరెడ్డిపేట్ లో అక్రమంగా సాగుతున్నరేషన్ బియ్యం దందా.

- గుట్టు చప్పుడు కాకుండా రాత్రి వేళలో రేషన్ బియ్యం తరలింపు.
- బియ్యం గోదాం పైన ఇటీవల ఎన్ఫోర్స్ మెంట్, టాస్క్ ఫోర్స్ అధికారుల దాడి.
- 20 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత, కేసు నమోదు.

నాగిరెడ్డిపేట్, ఆగస్టు,23, సూర్య మేజర్ న్యూస్.

నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో కొందరు వ్యక్తులు అక్రమంగా రేషన్ బియ్యం ( పీడీఎస్ బియ్యం ) వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. మండల కేంద్రం గోపాల్ పేట్‌కు చెందిన పలువురు వ్యాపారులు ఈ అక్రమ రేషన్ బియ్యం ధందా ను గుట్టు చప్పడు కాకుండా సాగిస్తున్నారు. కొందరు రైస్ మిల్లు యజమానులు, కిరాణం వ్యాపారులు, బియ్యం వ్యాపారస్తులు ఈ అక్రమ రేషన్ బియ్యం ధందాను యథేచ్చాగా సాగిస్తున్నారు. మండల కేంద్రంలోనే ఈ అక్రమ బియ్యం దందా సాగుతున్న స్థానిక అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని వివిధ గ్రామాలలో కొందరు వ్యక్తులు తమ రేషన్ కార్డు ద్వారా రేషన్ షాపుల నుంచి బియ్యాన్ని తీసుకొని వాటిని తినకుండా బియ్యం వ్యాపారులకు తక్కువ ధరకే అమ్మేస్తుంటారు. దీనిని ఆసరాగా చేసుకున్న బియ్యం అక్రమ ధందా వ్యపారులు గ్రామాలలో ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకే కొనుగోలు చేస్తారు. కిలో బియ్యాన్ని 15 నుంచి 18 రూపాయలకు కొనుగోలు చేసి తమ గోదాముల్లో బియ్యాన్ని నిల్వ చేసి రాత్రివేళ ఎవరికి తెలియ కుండా గుట్టు చప్పుడు కాకుండా వాహానాల్లో లోడ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ లాభాలు గడిస్తునారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రం గోపాల్ పేట లోని ఒక రైస్ మిల్ యజమాని గ్రామాలలో నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి తన రైస్ మిల్లు కు తరలించి రైస్ మిల్లులో రాత్రి వేళ రేషన్ బియ్యాన్ని నూకలుగా మార్చుతున్నట్టు, ఎవరికి ఎలాంటి అనుమానం రాకుండా నూకలను ఇతర ప్రాతాలకు తరలిస్తూ ఈ అక్రమ వ్యాపారాన్ని సాగిస్తున్నట్టు తెలుస్తోంది. కామారెడ్డి జిల్లాకు నాగిరెడ్డి పేట్ మండలం సరిహద్దు మండలం మైనందున మండలంలో

2

## బిచ్కుందలో కలెక్టర్ పర్యటన

బిచ్కుంద ఆగస్టు 23 సూర్య మేజర్ న్యూస్

బిచ్కుంద మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాల తోపాటు స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను రైతు వేదిక ఎం ఎల్ స్ పాయింట్ తో పాటు ప్రభుత్వ వైద్య



ఆసుపత్రి ని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సందర్శించారు. సందర్శన లో భాగంగా స్థానిక ఐటిఐ కళాశాలలోని విద్యార్థిని విద్యార్థులకు బోధన తీరుపై ఆరా తీశారు... అనంతరం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు భోజన వసతుల విషయమై భోజనాలకు సంబంధించిన నాణ్యత ప్రమాణాల తీరు పైన క్షుణ్ణంగా తనిఖీ చేశారు.. అనంతరం కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినులతో కలిసి మొక్కల పెంపకం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.. రైతు వేదిక ద్వారా ఇటీవల ప్రభుత్వం నుండి రుణమాఫీ ప్రక్రియలో సమస్యలు ఎదుర్కొంటున్న రైతుల విషయమై అధికారులు ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించే తీరు పైన పరిశీలించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు అనంతరం ప్రభుత్వ వైద్యాసుపత్రిలో రోగులకు అందిన్చే వైద్య సేవలు తీరుపైన ఆరా తీసి ప్రజలు ప్రభుత్వాసుపత్రి కి వచ్చే క్రమంలో మెరుగైన సేవలను అందించాలని సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటూ ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకోవాలని తెలిపారు. స్థానిక ఎంఎల్ ఎస్ పాయింట్ సైతం సందర్శించి ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన అలాగే పాఠశాలలకు హాస్టళ్లకు సంబంధించిన ఆహార ధాన్యాల సరఫరా తీరుపైన ఎప్పటికప్పుడు రికార్డుల మేరకు నిలువలను పొందుపరచాలని సూచించారు. ఈ కలెక్టర్ సందర్శనలో బిచ్కుంద తాసిల్దార్ సురేష్ బాన్సువాడ ఆడియో రమేష్ రాథోడ్ స్థానిక ఎంపీడీవో తో పటు ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు తదితరులు ఉన్నారు.



## బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు

బిక్కనూర్, ఆగస్టు 23, సూర్య మేజర్ న్యూస్

మండల కేంద్రంలోని స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో శుక్రవారం మండల వైద్యాధికారి హేమిమా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమున్న విద్యార్థులకు మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, ఏవైనా జ్వర లక్షణాలు ఉంటే స్థానిక ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించుకోవాలని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారిని సునీత, ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ, ఆరోగ్య సిబ్బంది శ్యామల, ఆశా కార్యకర్త సవిత వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ చెక్కులు అందజేత.



**ఎడపల్లి, ఆగస్టు23, సూర్య మేజర్ న్యూస్**

ఎడపల్లి మండలం కేంద్రం తో పాటు జాన్కంపేట్ గ్రామంలో ఎడపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పులి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ నియోజకవర్గంలో లబ్ధిదారులకు ఒక కోటి 19,53,500/- రూ విడుదల అవ్వగా, ఎడపల్లి మండలం కు 65 మంది లబ్ధిదారుల గాను 15 లక్షల 63 వేల రూపాయలు లబ్ధి చేకూర్ చేకూరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ నాయకులు టి.విజయ్ గౌడ్, రాధా కిషన్ గౌడ్, ఎల్లయ్య యాదవ్, బోధన్ వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్లు కె.సత్యనారాయణ, చేపూరి గంగా కిషోర్, గంగా ప్రసాద్, బండారు దశథ్, అశ్వక్ తాహెర్, ఆకారం సాయిలు, తాజీ మాజీ నెహ్రూ నగర్ సర్పంచ్ అమనుల్లా షరీఫ్, కాజా, సయ్యద్ జావిద్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య సమక్షంలో హెూటల్ స్థాపిస్తాం.

**సదాశివనగర్, ఆగస్టు 23, సూర్య మేజర్ న్యూస్**



సదాశివనగర్ మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా నిరుపయోగంగా ఉన్న ఎస్సీ కార్పొరేషన్ వారి కాంప్లెక్స్ లో మహిళా సమైక్య హెూటల్ ను ఏర్పాటు చేస్తున్నామని డిఆర్పి రమేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఏపిఎం రాజిరెడ్డి తో కలిసి పరిశీలనకు రాగా అక్కడే ఉన్న ఉమ్మడి మండలం మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్ రావు, స్థానిక సింగిల్ విండో చైర్మన్ కమలాకర్ రావు, మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ నాయకుడు కోతి లింగారెడ్డి, మండల బీసీ నాయకుడు కలాలి సాయ గౌడ్ తో కలిసి పరిశీలించారు. ఇటీవలే మాజీ జెడ్పిటిసి రాజేశ్వరరావు జిల్లా అధికారులను కలిసినప్పుడు భవనం వృధాగా ఉందని దాన్ని వినియోగంలో తేవాలని కోరినట్లుగా అధికారుల దృష్టికి తెచ్చారు. ఏది ఏమైనా మండల ఐకెపి ద్వారా మహిళలకు వ్యాపారం ఏర్పాటు చేసుకునే వీలుగా భవనాన్ని ఎంపిక చేయడం పట్ల జిల్లా యంత్రాంగానికి ఐకెపి అధికారులకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సంఘం నాయకురాలు దోకురి శోభ, సీసీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఒక వ్యక్తి పై కేసు నమోదు చేసిన చేసిన యస్ఐ

**ఎల్లారెడ్డి, ఆగస్ట్ 23, సూర్య మేజర్ న్యూస్**

ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మాల్దొడ్డి శ్రీనివాస్ గౌడ్ ఫిర్యాదు మేరకు గండిమాసానిపేట్ గ్రామానికి చెందిన గడ్డం జగన్ గౌడ్ పై కేసు నమోదు చేసామని యస్ ఐ బొజ్జా మహేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ., కేసు వివరాలు ఏమనగా శ్రీనివాస్ గౌడ్ స్నేహితుడు అయినా సతీష్ ను జగన్ గౌడ్ తిడుతుండగా శ్రీనివాస్ గౌడ్ అలా ఎందుకు తిడుతున్నావని జగన్ గౌడ్ ని ప్రశ్నించగా, జగన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ ని నువ్వు మధ్యలో ఎందుకు వస్తున్నావని బూతు మాటలు తిడుతూ చంపేస్తా అని బెదిరించినాడాని ఫిర్యాదు రాగా శుక్రవారం కేసు నమోదు చేసామని తెలిపారు.



# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలి

## మొబైల్ ఫోన్లకు బానిసలు కాకూడదు





**బిక్కనూర్, ఆగస్టు 23, సూర్య మేజర్ న్యూస్**

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరాలంటే చెడు వ్యసనాలకు లోను కాకుండా మంచి మార్గంలో నడవాలని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రమణ చెప్పారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థిని విద్యార్థులకు మానసిక ఆరోగ్యం పై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని, తక్కువ మార్కులు వస్తున్నాయని, సమాజంలో అవహేళనకు గురవుతున్నామని క్షణికావేశాలకు లోనయ్యి ఆత్మహత్యలు చేసుకోవద్దని భవిష్యత్తులో చాలా రకాల అవకాశాలు ఉంటాయని అందుకు తగు విధంగా మానసిక పరిపక్వతతో తయారవ్వాలని సూచించారు.అలాగే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని ముందుకు వెళ్లాలని అందుకు నిర్దిష్ట ప్రణాళిక ఎంచుకోవాలని అన్నారు. మత్తుపదార్థాల జోలికి అస్సలు వెళ్లకూడదని, మొబైల్ ఫోన్ వినియోగం ఎక్కువగా చేయకూడదని, అవసరమైనంత మేరకు మాత్రమే మొబైల్ వాడకం జరపాలని కానీ వాటికి బానిస కావద్దని తెలిపారు. ఇటీవల ఆత్మహత్యలు పెరుగుతున్న క్రమంలో జరిపిన సర్వేల్లో ఇవే విషయాలు స్పష్టం చేశాయని, అనంతరం మండల వైద్యాధికారి హేమిమా మాట్లాడుతూ తల్లిదండ్రులు, అధ్యాపకులు చెప్పిన మాటలను వినాలని మానసిక అనారోగ్యానికి గురి కావద్దని తెలిపారు. అలాగే ఎవరికైనా మానసిక ఆందోళనకు గురవుతే నేరుగా టోల్ ఫ్రీ నెంబర్ 14416కి కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకుంటూ మానసిక ఆరోగ్యం పై దృఢత్వాన్ని పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మని రాధిక, సోషల్ వర్కర్ డాక్టర్ రాహుల్ కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వెంకట రమణ,మంజుల, అధ్యాపకులు శ్రీనివాస్, లత, రఘువీర్ సింగ్ మరియు ఆశా కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులకు సవాల్ గా మారిన చైన్ స్నాచింగ్.

### వృద్ధురాలి మెడలో నుంచి 4 తులాల బంగారం చోరీ.

**ఆర్మూర్ ప్రతినిధి, ఆగస్టు 23, సూర్య మేజర్ న్యూస్**

చైన్ స్నాచర్లు మహిళల మెడలో నుంచి బంగారం చోరీ చేస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఏదో ఒకచోట చైన్ స్నాచింగ్ జరుగుతూనే ఉన్నాయి. అయితే కొత్త పంతాను ఎంచుకున్న దొంగలు ఒంటరిగా ఆటోలో ఉన్న వృద్ధురాలిని నమ్మించి చేర్చాల్సిన చోటుకి కాకుండా మామిడిపల్లి శివారులోకి తీసుకెళ్లి మెడలో ఉన్న బంగారాన్ని దొంగిలించారు.ఆర్మూర్ డివిజన్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్లో పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నప్పటికీ చైన్ స్నాచింగ్లు జరుగుతూ ఉండడం గమనార్హం. కాగా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ గ్రామానికి చెందిన బ్రాహ్మణపల్లి నర్సు బాయ్ అనే వృద్ధురాలు ఎమ్మార్ గార్డెన్ లో జరిగే వివాహానికి ఆటో ఎక్కింది అందులో మరో మహిళ ఉంది. చైన్ స్నాచర్లు ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని గమనించి ఆటోను వేరే చోటుకి తీసుకెళ్లారు. ఆటో ఉన్న ఆమెపై దాడి చేసి మెడలో ఉన్న మూడు తులాల బంగారు గుండ్లు తులం చైన్ ను గుంజుకొని ఆమెను అక్కడే వదిలేసి పారిపోయారు. భయానికి గురైన వృద్ధురాలు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## నాగిరెడ్డిపేట్ ఏఎస్ఐ బదిలీ.

**నాగిరెడ్డిపేట్, ఆగస్టు, 23, సూర్య మేజర్ న్యూస్**

నాగిరెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ లో గత నాలుగు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ లచ్చిరాం నాయక్ బదిలీ అయ్యారు.. బదిలీలో భాగంగా ఆయన రామారెడ్డి పోలీస్ స్టేషన్ కు బదిలీ అయినట్లు శుక్రవారం పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు స్థానిక ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐ లచ్చిరం నాయక్ ను స్థానిక ఎస్సై మల్లారెడ్డి తోపాటు పోలీస్ సిబ్బంది శాలువతో ఘనంగా సన్మానించారు.



# జిల్లాలో విజృంభిస్తున్న డెంగ్యూ...

## తస్మాత్ జాగ్రత్త...



కామారెడ్డి, సూర్య మేజర్ న్యూస్, ఆగస్టు 23

కామారెడ్డి జిల్లాలో రోజు రోజుకు విజృంభిస్తున్న డెంగ్యూ వ్యాధి కలకలం రేపుతుంది. ఈ వ్యాధి పట్ల పలువురు వైద్యాధికారులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. సరైన సమయంలో సరియైన చికిత్స తీసుకోకపోతే ప్రాణానికే ప్రమాదం అని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నప్పటికీ ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని ఆలోచనలు రాకపోవడం శోచనీయం. ఏది ఏమైనప్పటికీ డెంగ్యూ వ్యాధి దోమ కాటు వలన వ్యాప్తి చెందుతుందని అందరికీ తెలిసిన విషయమే. ఈ డెంగ్యూ దోమ కేవలము పగలు మాత్రమే కుడుతుందని, రాత్రి వేళలో దానికి కళ్ళు కనపడవని కనుక పగటిపూట దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని, తన ఇంటి పరిసరాలలో నిలువ అనేది ఉండకుండా దాన్ని లార్వా అభివృద్ధి చెందకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ మధ్యనే ప్రభుత్వం కూడా శుక్రవారం డ్రైడ్ గా ప్రకటించిన విషయం తెలిసిందే. స్థానిక మున్సిపల్ అధికారులతో పాటు గ్రామపంచాయతీ అధికారులు కూడా డెంగ్యూ వ్యాధిపై ప్రజలకు ప్రత్యేకమైన అవగాహన కార్యక్రమాన్ని కల్పిస్తున్నప్పటికీ ప్రజలు అప్రమత్తత లేకపోతే తస్మాత్ జాగ్రత్త ప్రాణాలకే ముప్పు వస్తుందని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. సూర్య ప్రతినిధి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ రామ్ సింగ్ తో మాట్లాడగా., ఆయన సూర్య పత్రికతో మాట్లాడుతూ., డెంగ్యూ వ్యాధి జులై మొదటి వారంలో ఏమీ లేనప్పటికీ జూలై ఆఖరి వరకు సుమారు 17 కేసులు నమోదైనట్లు ఆయన అన్నారు. ఆగస్టు నెలలో భారీగా కేసులు పెరుగుతుండడంతో ఈ కేసుల సంఖ్య 52 కు చేరింది. దీంతో డెంగ్యూ కేసుల సంఖ్య 72 కు చేరింది. సుమారు 60 మందికి చికిత్స పొంది చికిత్స తగ్గిన తర్వాత వారిని డిశ్చార్జ్ చేయడం జరిగిందని, మిగతా ఏడుగురు మాత్రమే ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని, అంతే కాకుండా వైరల్ వైరల్ ఫీవర్ తో అనేకమంది రోగులు ఆసుపత్రి దారి పట్టారని, అయినప్పటికీ వచ్చిన ప్రతి ఒక్కరికి ఆసుపత్రిలో పూర్తిస్థాయి చికిత్సలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అంతేకాకుండా డాక్టర్ల కొరత ఉన్నప్పటికీ ఉన్న డాక్టర్ల తో ఆసుపత్రి రన్ చేస్తున్నామని, గైనకాలజిస్ట్, జనరల్ సర్జరీ డాక్టర్ అవసరం ఉందని ఈ విషయమై ఉన్నతాధికారులకు లెటర్ రాయడం జరిగిందని, త్వరలో వైద్యుల కొరత కూడా తీరని ఉందని సూపరిడెంట్ రాంసింగ్ తెలిపారు. అంతేకాకుండా మందుల కొరత ఉన్నట్టు పలువురు ఆరోపించినప్పటికీ ఈ విషయమై సూపర్ నిన్ను ప్రశ్నించగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని కాకపోతే కొంతవరకు ఆసుపత్రిలో అందుబాటు లేని మందులను ప్రత్యేకంగా బయట ఉన్న మెడికల్ షాపుల నుండి రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మందులను ఇప్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. గతంలో కంటే మెడికల్ కాలేజ్ అయిన తర్వాత ఓపి రోగుల సంఖ్య దాదాపు 1000 నుంచి 1500 వరకు పెరిగిందని ఎప్పటికప్పుడు వారికి వైద్య చికిత్సలు అందించి మందులు రాయడం జరిగిందని ఆయన తెలిపారు. అంతే కాకుండా త్వరలో పూర్తిస్థాయిలో అన్ని విభాగాల డాక్టర్లు అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు. త్వరలో మరింత మెరుగైన సేవలు అందే విధంగా కృషి చేస్తామని డాక్టర్ రామ్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలోఆర్ ఎం ఓ లు యాదగిరి శ్రీనివాస్ లతోపాటు ఇతర సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

### డెంగ్యూ రాకుండా పలు జాగ్రత్తలు అవసరం

### ఆస్పత్రి సూపరిండెండెంట్ రామ్ సింగ్



ప్రజలు ప్రజలు క్షేత్రస్థాయిలో తమ తమ ఇళ్లలో నీరు నిల్వకుండా ఉండే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎక్కువ కాలం నీరునిలో ఉంటే లార్వా పెంపొంది అవకాశం ఉంటుందని అలా అని నిర్లక్ష్యం చేయకుండా ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎక్కడ కూడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఇది అందరి బాధ్యత అని తెలిపారు ప్రభుత్వం ప్రతి శుక్రవారం డ్రైడే గా ప్రకటించినప్పటికీ ప్రజల నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ప్రజలు ఏ చిన్న పాటి జరం వచ్చిన తలనొప్పి, వాంతులు, ఒళ్ళు నొప్పులు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్సలు తీసుకోవాలని ఆయన అన్నారు.

# ఆసుపత్రిలో దొంగతనం చేసిన వ్యక్తి అరెస్ట్

గాంధారి, సూర్య మేజర్ న్యూస్, ఆగస్టు 23




గత మూడు రోజుల క్రితం గాంధారి ప్రభుత్వ ఆసుపత్రిలో దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. గత 20 వ తేదీన అర్ధరాత్రి గాంధారి ప్రభుత్వ ఆసుపత్రిలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి దొంగతనం చేసినట్లు సిబ్బంది పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు అయన తెలిపారు. ఆసుపత్రి లోని కంప్యూటర్, యూపిఎస్ లు, ద్విచక్ర వాహనం దొంగలించబడ్డాయి. కేసు నమోదు తర్వాత దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు అనుమానస్పద వ్యక్తులపై నిఘా ఉంచి విచారణ చేపట్టారు. ఇందులో గాంధారి మండలం గుర్జాల్ గ్రామానికి చెందిన ములుగు గణేష్ అలియాస్ గన్ని అనే పాత నేరస్తుడిని విచారించిగా తప్పును ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుడి నుండి దొంగలించిన ద్విచక్ర వాహనం, కంప్యూటర్, యూపిఎస్, పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితుడిపై స్థానిక పోలీస్ స్టేషన్లో గతంలో గుడిమేట్ గుడిలో ద్విచక్ర వాహనం చోరీ కేసు కూడా ఉన్నట్లు తెలిపారు. నిందితుడు గణేష్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

# నేడు చలో ఆర్మూర్...

## రైతు ధర్నా విజయవంతం చేయాలి.

ఆర్మూర్ ప్రతినిధి, ఆగస్టు 23 సూర్య మేజర్ న్యూస్.



ప్రభుత్వం రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధి లోని రైతులు ఆర్మూర్ లో ధర్నా చేపట్టనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జరగనున్న ధర్నా కార్యక్రమాల విషయమై నాయకులు మాట్లాడారు. పార్టీలకతీతంగా రైతు ధర్నాను విజయవంతం చేయడానికి అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. బాల్కొండ నిజామాబాద్ రూరల్ ఆర్మూర్ నియోజకవర్గాల పరిధిలోని రైతులు కలిసికట్టుగా ఉండి రుణమాఫీ తో పాటు రైతు భరోసా కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు యాద గౌడ్, శ్రీనివాసరెడ్డి, లింగారెడ్డి, సురేష్ తదితరులు చెప్పారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తాలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు రైతు నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు. కాగా రైతు ధర్నాకు భారతీయ జనతా పార్టీ జిల్లా ఎంపీ ధర్మపురి అరవింద్ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, భారత రాష్ట్ర సమితి జిల్లా అధ్యక్షుడు ఆశన్న గారి జీవన్ రెడ్డి తమ పూర్తి మద్దతు ప్రకటించారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో
# సామూహిక శ్రీమంత కార్యక్రమం.

బోధన్, ఆగష్టు 23, సూర్య మేజర్ న్యూస్



నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో లయన్స్ క్లబ్ అయ్యప్ప సేవ ఆధ్వర్యంలో సామూహిక శ్రీమంత కార్యక్రమం నిర్వహించారు. కొత్తపల్లి నవిత, తనీరు రాజలక్ష్మి సహకారంతో ఈ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు, పండ్లు అందజేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వేమారి లక్ష్మి మాట్లాడుతూ., మాతృత్వం వరం లాంటిది అన్నారు. లయన్స్ క్లబ్ సామూహిక శ్రీమంతం కార్యక్రమం చేపట్టడాన్ని ఆమె అభినందించారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా గర్భిణీ మహిళలకు మానసిక ఆరోగ్య మరింత ఉత్సాహంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జామ్ చైర్మన్ భారతి, వై అంజనాదేవి, వెంకటలక్ష్మి, రాజలక్ష్మి, మంజూష, అయ్యప్ప శివా అధ్యక్షులు టి సుబ్బారావు, కార్యదర్శి పోశెట్టి, కే శ్రీకాంత్, సెక్రటరీ శ్రీనివాసరావు, ఆదినారాయణ, బసవేశ్వర రావు, లంక రవి తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలపై అవగాహన..
## కాంతి హై స్కూల్ లో డెమో నిర్వహణ

ఆర్మూర్ ప్రతినిధి, ఆగష్టు 23, సూర్య మేజర్ న్యూస్





అగ్ని ప్రమాదాలు జరిగిన సొంత బార్ లో తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయమై అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. పట్టణంలోని కాంతి హై స్కూల్ లో శుక్రవారం ఫైర్ స్టేషన్ ఆఫీసర్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నాలుగు రకాల అగ్ని ప్రమాదకర వస్తువుల గురించి వివరించారు. అదేవిధంగా ప్రమాదం జరిగిన సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఏ విధంగా కాపాడుకోవాలో చిట్కాలను వివరించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ కాంతి గంగారెడ్డి మాట్లాడుతూ., యువతకు సూచనలు చిట్కాలు ఇవ్వడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన అగ్నిమాపక కేంద్ర అధికార బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. లీడింగ్ ఫైర్ ఆఫీసర్ సురేష్, కానిస్టేబుల్స్ రాము, రాజ్ కుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు షాక్ ఒకరి మృతి

రాజంపేట, ఆగష్టు 23, సూర్య మేజర్ న్యూస్



విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందినట్లు రాజంపేట ఎస్సై పుష్ప రాజ్ తెలిపారు. అన్నారం తండాకు చెందిన తిరుపతి అనే వ్యక్తి తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి బోరు మోటర్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యాదా ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

# డబ్బులిస్తేనే పనులు చేస్తున్నారని
## తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు నిరసన.



నాగిరెడ్డిపేట్, అగష్టు 23, సూర్య మేజర్ న్యూస్

నాగిరెడ్డి పేట తహసిల్ కార్యాలయంలో మధ్య దళారుల ద్వారా డబ్బులిస్తేనే అధికారులు పనులు చేస్తున్నారని ఆరోపిస్తూ పలువురు రైతులు శుక్రవారం స్థానిక తహసిల్ కార్యాలయం ఎదుట బైఠాయించి తమ నిరసన తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపేట, ధర్మారెడ్డి తదితర గ్రామాలకు చెందిన పలువురు రైతులు కార్యాలయం ముందు నిరసన తెలిపారు. నాగిరెడ్డి పేట గ్రామానికి చెందిన కుమ్మరి అంజయ్య ఇటీవల తన కుటుంబ సభ్యుల పేరుట గల పట్టా భూమి పేర్ల మార్పిడికి సంబంధించి స్థానిక మీ సేవలో మూడు డాక్యుమెంట్ల కోసం చాలన్ డబ్బులు చెల్లించినప్పటికీ, రెవిన్యూ అధికారులకు డబ్బులు ఇవ్వడం కోసం మీ సేవ నిర్వాహకుడు ఒక్కో డాక్యుమెంటుకు నాలుగు వేల రూపాయల చొప్పున 12 వేలరూపాయలు అదనంగా తీసుకున్నట్లు కుమ్మరి అంజయ్య ఆరోపించారు. మీసేవ మధ్యవర్తి ద్వారా అధికారికి డబ్బులు ముడితేనే తమ పని పూర్తయిందని ఆయన అన్నారు. అలాగే ధర్మారెడ్డి గ్రామానికి చెందిన గుల్లపల్లి బాలయ్య తన అత్త సుశీల పేరిట 12 గుంటల పట్టా భూమి ఉందని, తన అత్త మృతి చెందిందన్నారు. సుశీలకు కూతురు ఎల్లవ్వ తప్ప మరెవరూ వారసులు లేని ఎల్లవ తన భార్య అని గుల్లపల్లి బాలయ్య తెలిపారు. తల్లి సుశీల పేరిట ఉన్న భూమిని కూతురు ఎల్లవ్వ పేరిట మార్పిడి చేయడంకోసం మీ సేవలో చాలాన్ డబ్బులు చెల్లించి మూడు నెలలు అవుతున్నా ఇప్పటికీ అధికారి పేరు మార్పిడి జరపలేదని ఆయన ఆరోపించారు. నేరుగా తాను కార్యాలయానికి వచ్చి తన భార్య పేరిట భూమి మార్పిడి చేయమని అధికారికి అడుగుతున్నందునే, అధికారి తమ పనిచేయడం లేదని మధ్య దళారులతో వచ్చి ఉంటే అధికారులు పనులు చేసే వారిని ఆయన ఆరోపించారు. రెవిన్యూ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి విషయమై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని రైతులు తెలిపారు.

### నిబంధనల ప్రకారమే పనిచేస్తున్నా...అవినీతికి పాల్పడడం లేదు.

**తహసిల్దార్ లక్ష్మణ్.**

మధ్య దళారుల ప్రమేయంతోనే తహశీల్దార్ కార్యాలయంలో పనులు జరుగుతున్నాయని వచ్చిన అవినీతి ఆరోపణల విషయమై స్థానిక తహసిల్దార్ లక్ష్మణ్ ను స్థానిక విలేకరులు వివరణ కోరగా, తాను ఎలాంటి అవినీతికి పాల్పడడం లేదన్నారు. నిబంధనల ప్రకారమే తాను పనులు చేస్తున్నట్లు తెలిపారు. తన పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్టు తన దృష్టికి రాలేదని , తన పేరు చెప్పి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# ఫ్రైడే డ్రై డే గా పాటించాలి.

### శబ్దల్పూర్ గ్రామపంచాయతీని పరిశీలించిన స్పెషల్ ఆఫీసర్ ఆర్డీవో మన్నె ప్రభాకర్





ఎల్లారెడ్డి, ఆగస్ట్ 23, సూర్య మేజర్ న్యూస్

వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రతీ శుక్రవారం అందరూ డ్రై డే పాటించాలని స్పెషల్ ఆఫీసర్ ఆర్డీవో మన్నే ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజుతో కలిసి ఎల్లారెడ్డి మునిసిపాలిటీ లోని ఆయా కాలనీలను పరిశీలించారు. అనంతరం శబ్దల్పూర్ గ్రామపంచాయతీని పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి స్కూల్, పరిసరాలను పరిశీలించారు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని తెలియజేశారు. గ్రామ పంచాయతీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిచ్చి మొక్కలను తొలగించి పచ్చదనంలో భాగంగా మొక్కలను పెంచాలని, కాలుష్యాన్ని నివారించాలని దోమల మందు పిచికారి చేయించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ., ఇళ్లలో వాడే కుండీలలోని నీటిని రెండు రోజులకొకసారి మార్చాలని, ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచకూడదని, కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ వంటి వస్తువులు ఇళ్ల పరిసరాల్లో వుంచకుండా చూడాలని సూచించారు. కాలువలకు అడ్డంగా రాళ్లను పెట్టడం వల్ల నీరు నిల్వ వుంటుందని, వాటిని వెంటనే తొలగించాలని గ్రామపంచాయతీ సిబ్బందికి ఆదేశించారు విధులు,మురికి కాలువలను రోజూ శుభ్రం చేయాలని, ఎక్కడా చెత్త కనిపించకూడదని, ఎప్పటికప్పుడు చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మున్సిపాలిటీ కమిషనర్ శ్రీహరి రాజు, ఎంపీ ఓ అతినారపు ప్రకాష్, పాఠశాల ఉపాధ్యాయులు, వాడి కార్యకర్త ఆశ వర్కర్ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నగరేశ్వర ఆలయ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే మరియు చైర్మన్.

బీర్కూర్, ఆగష్టు 23, సూర్య మేజర్ న్యూస్



బీర్కూరు పట్టణ కేంద్రంలో శుక్రవారం రోజు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 12 లక్షలతో ఏర్పాటు చేసిన నగరేశ్వర ఆలయాన్ని పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే యాదవ సంఘం ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రఘు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోయిన శంకర్, మాజీ సర్పంచ్ గంగారాం, విజయప్రకాష్, ఆవారి గంగారం, సందీప్ పటేల్,శశికాంత్ యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భావజాలంతో పనిచేయాలి.

### ఎంఆర్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మార్పీఎస్ సత్తిగారి లక్ష్మి

కామారెడ్డి, సూర్య మేజర్ న్యూస్, ఆగస్టు 23



అంబేద్కర్ భావజాలంతో కార్యకర్తలు పని చేయాలని రాష్ట్ర కార్యదర్శి సత్తిగారి లక్ష్మి అన్నారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ., 75 సంవత్సరాలు 59 కులాల సంపదను కేవలం మాల సామాజిక వర్గమే అనుభవించింది కనుక తక్కువ వస్తే ఓర్వలేక 59 కులాల వనరులను ఒక ఒక వర్గానికి చెందితే మరి మిగతా కులాలు ఏం కావాలి మాల సోదరులు అర్థం చేసుకొని సుప్రీంకోర్టు ద్వారా వర్గీకరణ విషయము రాష్ట్రాలు చేసుకోవచ్చని తీర్పునివ్వడం తెలిసింది. కనుక ఇకనైనా అంబేద్కర్ భావజాలాలతో పని చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎంఆర్పిఎస్ మహిళా అధ్యక్షురాలు సత్తి గారి లక్ష్మి అన్నారు. సమాన న్యాయం అందరికీ రావాలని కోరారు. ఇకనైనా న్యాయమైన వాటా కోసం ప్రైవేటు రంగంలో కొల్లగొడుతుంటే వాటిపై పట్టించుకోకుండా వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెస్తున్నారు. కానీ కొంతమంది కావాలని రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాచడి మండల అధ్యక్షుడు రమేష్ బట్ట, రామారెడ్డి మండల అధ్యక్షుడు రాజనర్సయ్య, రామారెడ్డి మహిళా అధ్యక్షురాలు లావణ్య. రాజంపేట మహిళా అధ్యక్షురాలు సుజాత, కామారెడ్డి టౌన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ టాలెంట్ టెస్ట్ లో విద్యార్థుల ప్రతిభ

బిక్కనూర్, ఆగస్టు 23, సూర్య మేజర్ న్యూస్



జాతీయ స్పేస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులకు స్పేస్ డే టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి బహుమతి రుషికేష్ ( చైతన్య విద్యానికేతన్ పాఠశాల), ద్వితీయ బహుమతి రామ్ చరణ్ (చైతన్య విద్యానికేతన్ ), తృతీయ బహుమతి వంశిక (జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ), సిరి, వినీత్ సాయి ( విజ్ఞాన్ హై స్కూల్ ), ప్రోత్సాహక బహుమతులు స్పందన ( సిద్ధార్థ విద్యాలయం ), మహేష్ ( జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ) విద్యార్థులకు బహుమతులను జిల్లా సైన్స్ అధికారి సిద్ధరాంరెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుండే మేధస్సును పెంచుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్, సుజాత, ఉపాధ్యాయులు రాజు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు.

ఎడపల్లి, ఆగస్టు 23, సూర్య మేజర్ న్యూస్



ఎడపల్లి మండలం ఏఆర్పి క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు ఛత్రపతి యువజన సంగం సహకారంతో శుక్రవారం 126 మంది విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షించిన విద్యార్థులలో 26 మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు కంటి వైద్యులు శ్రీకాంత్ గుర్తించారు. ఎవరైతే కంటి సమస్యలు బాధపడుతున్నారో వారికి త్వరలోనే కంటి అద్దాలు అందజేయనునట్లు సంస్థ స్టేట్ కోఆర్డినేటర్ వినోద్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, బోధన సిబ్బంది సురేందర్, సాయిలు, సరిత, సౌజన్య, ఛత్రపతి శివాజీ యువజన సంఘం అధ్యక్షులు బండారి నరసింహులు, వెంకటేష్, కిరణ్,రాకేష్, ప్రవీణ్,రాజు, సంతోష్, రామ్ కుమార్, సంతోష్ మహేష్, నరేందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీల కోసం జాతీయ పొలిటికల్ పార్టీ ఏర్పాటు.

ఆర్మూర్ ప్రతినిధి, ఆగస్టు 23 సూర్య మేజర్ న్యూస్.



బహుజనుల కోసం నూతన జాతీయ పొలిటికల్ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు అబ్బగోని అశోక్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వాలు ఎన్ని మారిన బీసీల తలరాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఓటు హక్కును ఆయుధంగా ఇచ్చారని, డెమొక్రటిక్ కంట్రీలో స్వేచ్ఛను కల్పించారని పేర్కొన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాలను దృష్టిలో పెట్టుకొని సావిత్రిబాయి, జ్యోతిబా పూలే ఆశయ సాధన కోసం పార్టీని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బిసి వర్గాలు విద్య ఉద్యోగ రాజకీయ పరంగా పూర్తిగా వెనుకబడి ఉన్నారని అన్నారు. అగ్రవర్ణాల రాజకీయలలో బీసీలకు సరైన స్థానం లేదని, ఉన్న బిసి నాయకులకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపించారు. జనాభా తమాషా ప్రకారం బీసీలకు రావలసిన వాటా ప్రకారం కుల గణన జరిపించాలని డిమాండ్ చేశారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు పూర్తి న్యాయం జరిపించేలా పార్టీ కృషి చేస్తుందన్నారు. బీసీ మహిళలకు పార్టీలో ప్రత్యేక స్థానాన్ని కేటాయిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమం తర్వాత రాబోయేది బీసీల ఉద్యమమేనని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అబ్బ గోని అశోక్ గౌడ్ వివరించారు.

## బీర్కూరులో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం.

బీర్కూర్, ఆగష్టు 23, సూర్య మేజర్ న్యూస్



బీర్కూర్ మండలంలో శుక్రవారం రోజు డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల స్పెషల్ ఆఫీసర్ నరేష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ., పరిసరాలు పరిశుభ్రత పై అవగాహన కల్పించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ప్రజలు అనారోగ్య బారిన పడకుండా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మహబూబ్, కార్యదర్శి గంగారం, తదితరులు పాల్గొన్నారు.

## మిని టాంక్ బండ్ వద్ద ఉద్యానవనంపై
## ఆర్కిటెక్చర్ తో చర్చించిన ఎమ్మెల్యే.

ఎల్లారెడ్డి, ఆగస్టు 23, సూర్య మేజర్ న్యూస్

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్లారెడ్డి అభివృద్ధి పై ఆర్కిటెక్చర్ తో ఎమ్మెల్యే మదన్మోహన్ సమావేశమయ్యారు ఈ సమావేశంలో ఎల్లారెడ్డి మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా అడుగులు వేసే విధంగా చేయాలని సర్కిటెక్చర్ తో వెళ్లి అన్నారు ఎల్లారెడ్డి పెద్ద చెరువు అభివృద్ధి, మినీ ట్యాంక్ బండ్ గా మార్చడం, పిల్లల కోసం ఉద్యానవనాన్ని నిర్మించడం, మరి ఎల్లారెడ్డి ప్రజల కోసం ఆ ఉద్యానవనంలో వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేయడంపై ఆర్కిటెక్ట్ తో మదన్మోహన్ చర్చించారు త్వరలోనే నివేదికలను తయారుచేసి స్పష్టమైన ప్రణాళికలతో రావాలని ఆయన సూచించారు ఎల్లారెడ్డిని ఒక అభివృద్ధి దిశగా తీసుకువెళ్లాలని ఆయన ఆకాంక్షించారు.

